# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-03-2026 సమయం : సాయంకాలం 6గం.30ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రవేట్ పరం చేసే యోచన లేదని రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.
- కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.
- ముడి చమురు సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలియజేశారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి కేబినెట్ నిర్ణయాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. రాజధాని అమరావతి అభివృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయం, పరిశ్రమలు, జలవనరులు, విద్యుత్, పర్యాటకం, తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్న మంత్రివర్గం సీఆర్డీఏ నిర్ణయాలకు ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణాలకు ఆమోదం తెలిపి, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం 2 వేల 316 కోట్ల రూపాయలకు పరిపాలనా అనుమతులిచ్చిందని వివరించారు. అలాగే.. 119 కోట్ల రూపాయల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్ లో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు 23 కోట్ల 47లక్షల రూపాయలు కేటాయించామని, పోలవరం ప్యాకేజ్-64 పనులకు 24 కోట్ల 51లక్షల రూపాయలు మంజూరు చేసేందుకు మంత్రివర్గం అనుమతించిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…36 సెకన్లు)

====================

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రవేట్ పరం చేసే యోచన ఏదీ లేదని ఎక్సైజ్, గనులు, భూగర్భవనరుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర.. రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫిషింగ్ హార్బర్ ఇప్పటికీ ప్రభుత్వ మత్స్య శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతోందన్నారు. మొత్తం 114 ఎకరాల 13 సెంట్ల హార్బర్ భూమిలో 7 ఎకరాలు మాత్రమే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఫిషింగ్ హార్బర్ లో తీరం అనుసంధానం, టెక్నాలజీ కోసం ఆ 7 ఎకరాల భూమిని ఇస్తున్నామని, మత్స్యకారులకు ఆధునిక కమ్యూనికేషన్, వాతావరణ సమాచారం అందించేందుకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్…25 సెకన్లు)

====================

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. అమరావతిలోని సచివాలయంలో కొత్తగా 28 మంది అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లకు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను ఆయన ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్మిక శాఖను మరింత బలోపేతం చేయడానికి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ల నియామకం కీలకమన్నారు. కొత్తగా నియమించబడిన అధికారులకు అభినందనలు తెలిపిన మంత్రి.. ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని సూచించారు. కార్మికుల హక్కులను రక్షించడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

=====================

విరామం

=====================

ముడి చమురు సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని బీజేపీ జాతీయ మండలి సభ్యుడు, ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఈరోజు ఆయన విజయవాడలో మాట్లాడుతూ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జై శంకర్ ఇరాన్ అధికారులతో మాట్లాడి ముడి చమురు రవాణాకు అవరోధాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా దేశంలో ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ వనరులను కూడా సమర్ధవంతంగా వినియోగిస్తున్నట్టు లంకా దినకర్ పేర్కొంటూ...

(వాయిస్...35 సెకన్లు)

=====================

అమరావతిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (BITS) పిలాని ఏఐ ప్లస్ క్యాంపస్ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్లను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పరిశీలించారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్.చెన్నవీర్, బీవీస్ సహాని ఈరోజు మంత్రి లోకేష్ ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి క్యాంపస్ ప్లాన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బిట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి క్యాంపస్ లో ఉంటాయని తెలిపారు. బిట్స్ నిర్మాణ ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేష్ సంతృప్తి వ్యక్తంచేశారు. సాధ్యమైనంత త్వరగా క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని బిట్స్ ప్రతినిధులను కోరారు.

=====================

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాలలో రేపు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాలు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కింద కేసులు అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, కుటుంబ తగాదాలతో సహా రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

=====================

ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఈరోజు ఆయన డీఈవో ఎల్. చంద్రకళతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 13 వేల 909 మంది బాలురు, 13 వేల 451 మంది బాలికల కోసం 149 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 9 గంటల 30 నిముషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 45నిముషాల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించడం జరిగిందని.. 144 సెక్షన్ అమలు చేయనున్నామని చెప్పారు.

=====================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు మారుమూల ప్రాంతాలకు చేరడానికి అటవీశాఖ అనుమతులు వేగంగా అందించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. అటవీశాఖ అనుమతులు, వివిధ శాఖల అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో కలెక్టర్ ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీఎం జన్ మన్ (PM-JANMAN), జల జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్ వంటి

పథకాల అమలులో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అటవీశాఖ పరిధిలో ఉన్న పాత విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ, దేవాదాయ శాఖ పరిధిలోని రోడ్ల నిర్మాణం, టూరిజం అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ, రెవెన్యూ, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

=====================
=====================